క్లుప్తంగా

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 15 వినతులు


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమేష్

సీతమ్మధార : స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అర్జీదారులు పలు వినతులు అందించారు. తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.రమేష్ 15 మంది నుంచి వినతులు స్వీకరించారు. ఆర్ఐ ఇబ్రహీం, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు మట్టిదిబ్బల తరలింపు


మట్టి తరలించిన తర్వాత విశాలంగా 60 అడుగుల రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డులో పేరుకుపోయిన మట్టిదిబ్బలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. జోన్ – 3 అధికారులు స్పందించి మట్టి తరలించారు. 'యూజీడీ కోసం తవ్వి వదిలేశారు' శీర్షికతో 'సాక్షి'లో ఈ నెల 24న ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. సోమవారం సిబ్బందిని పంపించి అక్కడి మట్టిదిబ్బలు తరలించారు. 24వ వార్డు మంచినీటి సరఫరా విభాగం అసిస్టెంట్ ఇంజినీర్ రహీమ్ పర్యవేక్షణలో సిబ్బంది మట్టి తరలించారు. వర్షాల కారణంగానే మట్టి తరలింపు పనుల్లో ఆలస్యమైందని ఆయన తెలిపారు.

చురుగ్గా యూజీడీ పనులు


రేసపువానిపాలెంలో ఏర్పాటు చేస్తున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలో భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇక్కడి జాతీయ రహదారి పక్కన గెడ్డను ఆనుకుని ఉన్న రోడ్డులో మ్యాన్‌హోల్ ఏర్పాటు పనులు జోరుగా సాగుతున్నాయి. వార్డు ఇంజినీర్ పర్యవేక్షణలో కాంట్రాక్ట్ సిబ్బంది ఈ ప్రాంతంలో కొత్తగా యూజీడీ కనెక్షన్లు ఇవ్వడానికి పనులు చేస్తున్నారు. పనులు పూర్తయితే పారిశుధ్యం మెరుగవుతుందని స్థానికులు భావిస్తున్నారు. ఈ రోడ్డు పొడుగునా ఎంపిక చేసిన ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేస్తున్నారు. జోన్ – 3 పబ్లిక్ వర్క్స్ విభాగం ఆధ్వర్యంలో యూజీడీ పనులు జరుగుతున్నాయి.

మార్కెట్‌కు దీపావళి శోభ

- ఆకట్టుకుంటున్న వెరైటీ దీపాలు
- వివిధ ఆకృతుల్లో డిజైనర్ దీపాలు
- నూనె అవసరం లేని బ్యాటరీ, విద్యుత్ దీపాల కొనుగోలుపై మహిళల ఆసక్తి


విక్రయానికి సిద్ధంగా మట్టి ప్రమిదలు


ఆకర్షణీయమైన రూపాల్లో బ్యాటరీ దీపాలు

సీతంపేట : దీపావళి పండగ రోజు ఇళ్లంతా దీపాల కాంతులతో నింపేస్తాం. ఆ రోజు ఏ ఇంటి ముందు దీపాలు సమృద్ధిగా వెలుగుతాయో ఆ ఇంట శ్రీమహాలక్ష్మి ప్రవేశిస్తుందని పెద్దలు చెబుతుంటారు. అందుకే దీపావళి రోజు సాయంత్రం మహిళలు ఇంటి నిండా దీపాలు, కొవ్వొత్తులు వెలిగించి మహాలక్ష్మికి పూజ చేసి స్వాగతం పలుకుతారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా, చీకటిని పారదోలుతూ వెలుగులు నింపే పండగ దీపావళి. ఆశ్వయుజ మాస అమావాస్య రోజున వచ్చే ఈ పండగకు ఎంతో విశిష్టత ఉంది. అమావాస్య చీకట్లు తొలగిపోయేలా దీప మాలికల శోభ ప్రతి ఇంటా కనువిందు చేస్తుంటుంది.

మట్టి ప్రమిదలే సాంప్రదాయం

పూర్వం నుంచి మట్టి ప్రమిదల్లో ఒత్తులు, నూనె వేసి దీపాలు వెలిగించడం సాంప్రదాయం. మట్టి ప్రమిదలకు మరిన్ని హంగులతో రంగులు అద్దిన దీపాలు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. సాదా ప్రమిదలతోపాటు వివిధ ఆకృతుల్లో మట్టి ప్రమిదలు లభిస్తున్నాయి. నక్షత్ర దీపాలు, పంచముఖ దీపాలు, దీప స్తంభాలు, ఆకాశ దీపాలు, చిమ్నీ దీపాలు, పింగాణీ దీపాలు... ఇలా పలు రకాల మోడల్స్‌లో దీప ప్రమిదలు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.


ఆకట్టుకుంటున్న సీరియల్ లైట్ల దండలు

నూనె లేకుండా వెలిగే దీపాలు...

మారిన కాలానికి అనుగుణంగా నూనె లేకుండా వెలిగే దీపాలు మార్కెట్‌లో వినియోగదారులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. బ్యాటరీతో, కరెంట్‌తో అచ్చం నూనె దీపంలా వెలుగులు విరజిమ్మే దీపాలు దుకాణాల్లో విక్రయిస్తున్నారు. దీపాలు వెలిగించడానికి నూనె అవసరం లేకపోవడంతోపాటు గాలి వీస్తే ఆరిపోతుందన్న భయం లేదు. ప్రతి సంవత్సరం వాడుకునే సౌలభ్యం ఉండటంతో బ్యాటరీ, విద్యుత్ దీపాలు కొనుగోలు చేసేందుకు మహిళలు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో మహిళలను ఆకర్షించే మోడల్స్‌లో దీపాలను వ్యాపారులు విక్రయిస్తున్నారు.


వివిధ ఆకృతుల్లో డిజైనర్ దీపాలు

డిజైనర్ ప్రమిదలు, బ్యాటరీ క్యాండిల్స్...

మట్టి ప్రమిదలను వివిధ డిజైన్లలో రంగులతో చూడముచ్చటగా అలంకరించి డిజైనర్ ప్రమిదలను కొంతమంది విక్రయిస్తున్నారు. అలాగే కంపెనీలు తయారు చేసిన డిజైనర్ ప్రమిదలను కోల్‌కతా నుంచి దిగుమతి చేసుకుని వ్యాపారులు, షాపింగ్ మాల్స్‌లో విక్రయిస్తున్నారు. వీటితోపాటు ఆకర్షణీయంగా పలు రకాల క్యాండిల్స్, డెకరేటివ్ క్యాండిల్స్ అందుబాటులోకి వచ్చాయి. ఫ్లోటింగ్ క్యాండిల్స్, సెంటెడ్ క్యాండిల్స్, వాటర్ క్యాండిల్స్, బ్యాటరీ కేండిల్స్, కుందన్ క్యాండిల్స్, జెల్ క్యాండిల్స్, క్యాండిల్ స్టాండ్స్ వివిధ రకాల్లో వ్యాపారులు విక్రయిస్తున్నారు. అలాగే విద్యుత్‌తో వెలిగే దీపాల సీరియల్ దండలు ఆకర్షణీయమైన రూపాల్లో మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

విభిన్న ఆకృతుల్లో ప్రమిదలు

సీతమ్మధార : దీపావళి పర్వదినం కోసం రకరకాల డిజైన్లలో రంగురంగుల ప్రమిదలు సిద్ధం చేశారు. సీతమ్మధార రైతుబజార్ సమీపంలో, ఎంఎంటీసీ కాలనీ, సత్యం జంక్షన్ తదితర ప్రాంతాల్లో తాత్కాలిక స్టాళ్లు ఏర్పాటు చేసి పలురకాల ప్రమిదలు విక్రయిస్తున్నారు. మట్టితో తయారు చేసిన ప్రమిదలకు రంగులద్ది విక్రయిస్తున్నారు. ఈ ప్రమిదలు రూ.200 నుంచి రూ.500 వంతున విక్రయిస్తున్నారు. వినాయకుడు, లక్ష్మీదేవి, విగ్రహాలు, దీపపు లాంతర్లు విక్రయిస్తున్నారు. ఒక్కో లాంతరు ప్రారంభ ధర రూ.200గా ఉంది. సత్యం జంక్షన్ సమీపంలో దీపావళి రోజున వినియోగించే లైట్లను విక్రయిస్తున్నారు. ఇవి చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మహిళలు పలు స్టాళ్లలో ప్రమిదలు కొనుగోలు చేశారు.


రైతుబజార్ సమీపంలో విక్రయిస్తున్న ప్రమిదలు


ఇళ్లలో వినియోగించే దీపపు లాంతర్లు

తాగునీటికి నిత్యం నాణ్యతా పరీక్షలు

- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

దాబాగార్డెన్స్ : నగర ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితం కాకుండా నిత్యం నాణ్యతా పరీక్షలు నిర్వహించాలని, శుద్ధి చేసిన తాగునీటిని ప్రజలకు అందించాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు పి.శివప్రసాదరాజు, నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎన్ రవితో కలిసి బర్మాకాలనీలో గల బ్లాక్ 18 నీటి సరఫరా పంప్ హౌస్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బర్మాకాలనీ పంప్ హౌస్ నుంచి సరఫరా చేస్తున్న నీటి నాణ్యతను పరిశీలించారు. రోజూ ఎన్ని శాంపిల్స్ పరీక్షిస్తున్నారని ఆరా తీశారు. అనంతరం సమీపంలోని ఓ ఇంటి వద్ద వ్యక్తిగత కుళాయిలో వస్తున్న నీటిని కమిషనర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగర ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌ల వద్ద నీటి సరఫరా విభాగం, ఏజెన్సీలతో పరీక్షలు జరిపి రోజుకి 300 ఎంఎల్‌డీ తాగునీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నామన్నారు. నగరంలోని ఏ ప్రాంతంలోనైనా తాగునీరు పరీక్షించేందుకు మొబైల్ టెస్ట్ వాహనాలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రతిపాదించామని తెలిపారు. కాలువల వద్ద కలిసే పైప్‌లైన్లు మార్పించామని, లీకేజీలు గుర్తించి అరికట్టామన్నారు. వ్యక్తిగత కుళాయి కనెక్షన్ కలిగిన నివాసితులు జీవీఎంసీ సిబ్బందికి సహకరించాలని కోరారు.


బర్మాకాలనీ బ్లాక్ 18 పంప్‌హౌస్ వద్ద అధికారులతో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

ప్రమాదకరంగా గొయ్యి


శాంతిపురం రోడ్‌లో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

సీతంపేట : జీవీఎంసీ 25వ వార్డు పరిధి శంకరమఠం రోడ్ క్రాస్‌బేకరీ పక్కన గల శాంతిపురం రోడ్ మధ్యలో ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. గొయ్యి ఏర్పడి రెండు వారాలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్డు మధ్యలో గొయ్యి ఉండడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానికులు హెచ్చరికగా చెట్ల కొమ్మలు పెట్టారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారిలో వెంటనే గొయ్యి పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

కుటుంబ సభ్యులకు యువకుడి అప్పగింత

సీతమ్మధార : మానసిక సమస్యలతో బాధపడుతున్న కార్తీక్ రే అనే యువకుడిని సోదరుడు మత్యుంజయ్ రేకు ఏయూటీడీ, శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు సోమవారం అప్పగించారు. ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా, పెదకొండ గ్రామానికి చెందిన కార్తీక్ పది రోజుల క్రితం స్నేహితులతో కలిసి వైజాగ్ వచ్చేశాడు. అక్కయ్యపాలెంలో మద్యం మత్తులో గొడవ చేయడంతో స్థానికులు కొట్టి పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసుకి సమాచారమివ్వడంతో ఆయన తీసుకెళ్లి షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. సుమారు పదేళ్లుగా మానసిక సమస్యతో బాధపడుతున్నాడని తెలుసుకుని శ్రద్ధ ఫౌండేషన్ సహకారంతో వారం రోజులపాటు చికిత్స అందించారు. అనంతరం కోలుకోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారమివ్వగా వారు నగరానికి వచ్చి కార్తీక్‌ను తీసుకెళ్లిపోయారు.


సోదరుడికి కార్తీక్ రేని అప్పగిస్తున్న ఏయూటీడీ, శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు

78 మద్యం సీసాలు స్వాధీనం


బంగారునాయుడు

సీతమ్మధార : నరసింహనగర్ రైతు బజార్ వద్ద గల అమెరికన్ బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలో సోమవారం రాత్రి ఓ వ్యక్తి నుంచి 78 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ కె.సత్యనారాయణ సిబ్బందితో కలిసి నరసింహనగర్‌లో తనిఖీలు చేశారు. ఇక్కడి అమెరికన్ బార్ అండ్ రెస్టారెంట్‌లో వెయిటర్‌గా పనిచేస్తున్న ఏలూరు జిల్లా, జంగారెడ్డి గూడెం మండలం, యాగవరం గ్రామానికి చెందిన చెల్లూరి బంగారు నాయుడు (34) వద్ద అక్రమంగా మద్యం సీసాలున్నట్లు గుర్తించారు. సమీపంలోని వైన్‌షాపుల వద్ద కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు నిర్ధారించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని తెలిపారు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఎస్.విజయకుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ వెంకటరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇష్టానుసారం పార్కింగ్ చేస్తే చర్యలు

సీతమ్మధార : ప్రైవేట్ ట్రావెల్ బస్సులు ఇష్టానుసారం పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ద్వారకా జోన్ ట్రాఫిక్ సీఐ కె.ఎస్.ఎన్.వి.ప్రసాద్ హెచ్చరించారు. ఆయన సోమవారం స్టేషన్ పరిధిలో గల శ్రీనగర్, రామాటాకీస్, రేసపువానిపాలెం తదితర ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి పర్యటించారు. రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన ట్రావెల్ యాజమాన్యాలపై కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. నో పార్కింగ్ ప్రదేశాల్లో బస్సులు నిలిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డుపై ప్రయాణికుల కోసం అధిక సమయం పార్కింగ్ చేయరాదని కోరారు. అలాగే బస్టాపుల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రైవేట్ ట్రావెల్ బస్సులు ఆపొద్దని సూచించారు. ఈ సందర్భంగా రామాటాకీస్ రోడ్డులో గల ప్రైవేట్ ట్రావెల్ బస్సు యాజమాన్యాలతో సమావేశమయ్యారు. రోడ్డు నిబంధనలు పాటించాలని, ట్రాఫిక్‌కి ఆటంకం కలిగించొద్దని కోరారు. ఆయనవెంట ద్వారకా స్టేషన్ ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు, సిబ్బంది ఉన్నారు.


శ్రీనగర్‌లో రోడ్డు పరిశీలిస్తున్న ఫోర్త్‌టౌన్ సీఐ ప్రసాద్

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం


గంజాయితో జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం : రైల్వేస్టేషన్‌లో అక్రమంగా తరలించేందుకు ఉంచిన గంజాయిని విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్ఐ కె.శాంతారాం, ఆర్పీఎఫ్ ఎస్ఐ జూలీ కర్మాకర్ సిబ్బందితో కలసి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 6, 7వ నెంబర్ ప్లాట్‌ఫాంల మధ్యలో రెండు బ్యాగులు గుర్తించారు. వాటిని తెరిచి చూడగా 18.5 కేజీల గంజాయి ఉంది. జీఆర్పీ సిబ్బంది గంజాయిని సీజ్ చేశారు.

సమస్యలు త్వరగా పరిష్కరించాలి

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్ – 5 కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు నలుగురు వినతులు అందించారు. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ బి.రాము నేరుగా వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ విభాగానికి 2, టౌన్‌ప్లానింగ్ విభాగానికి 1, పబ్లిక్ హెల్త్ విభాగానికి 1 వినతి అందినట్లు ఆయన తెలిపారు. ఆర్వో బాబూరావు, ఈఈ తారా ప్రసన్నరెడ్డి, ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము

జోన్-3కి రెండు ఫిర్యాదులు

సీతమ్మధార: ఆశీలమెట్టలోని జీవీఎంసీ జోన్-3 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి రెండు ఫిర్యాదులను జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదులు, వాటి పరిష్కార సమాచారాన్ని ఫిర్యాదుదారులకు ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గంగాధర్, డిప్యూటీ ఇంజినీర్ పద్మావతి, సహాయ వైద్యాధికారి డాక్టర్ భాస్కరరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ గోపన్న, యూసీడీ విభాగం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎల్.రాము, ఆర్వో పైడిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నిఘా వారోత్సవాలు ప్రారంభం


అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం : ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో నిఘా అవగాహన వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రైల్వే కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ సమగ్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఇదేవిధంగా అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లు, సబ్ డివిజనల్ యూనిట్స్‌లో నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు బ్యానర్స్, పోస్టర్స్ ప్రదర్శిస్తున్నారు. అవినీతి రహిత దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ పాల్గొనేలా ఆడియో, వీడియో సందేశాల ద్వారా, ప్రత్యేక డ్రైవ్‌ల ద్వారా అవగాహన కల్పిస్తారు. ఉద్యోగులు, సిబ్బందికి సెమినార్స్, వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఐసీ పాలసీలపై బోనస్ పెంచాలి


ధర్నాలో మాట్లాడుతున్న ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం చైర్మన్ గజపతిరావు

సీతమ్మధార : జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) పాలసీల మీద బోనస్ పెంచాలని ఎల్ఐసీ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫి) పొలిటికల్ ఎఫైర్స్ విభాగం చైర్మన్ ఎస్.గజపతిరావు కోరారు. ఈ మేరకు సీతమ్మధారలో గల బ్రాంచి ఆవరణలో కొద్ది రోజులుగా ఎల్ఐసీ ఏజెంట్లు నిర్వహిస్తున్న ధర్నాలో ఆయన సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫెడరేషన్ పిలుపులో భాగంగానే ఏజెంట్లు ధర్నా చేస్తున్నారన్నారు. ఎల్ఐసీ యాజమాన్యం మొండివైఖరి విడనాడాలని కోరారు. సీతమ్మధార బ్రాంచి ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు బి.బంగార్రాజు మాట్లాడుతూ ఎల్ఐసీ పాలసీల మీద జీఎస్టీ తొలగించాలని, బోనస్ పెంచాలని కోరారు. ఏజెంట్ల కమిషన్ పెంచాలని కోరారు. ధర్నాలో బ్రాంచి ఏజెంట్ల సంఘం కార్యదర్శి రాంబోతు అప్పారావు, కోశాధికారి కె.వి.రమణమూర్తి, ఇల్లిపల్లి శ్రీనివాస్, టి.శ్రీనివాస్, నర్సింగరావు, దినేష్, సీరపు దివాకరరెడ్డి పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు స్థల పరిశీలన


బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలిస్తున్న ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి

సీతమ్మధార : బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో గల పోర్టు స్టేడియం సమీపాన దీపావళి కోసం బాణసంచా ఏర్పాటు చేసే ప్రాంతాన్ని ఈస్ట్ జోన్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి సోమవారం నాలుగో పట్టణ పోలీసులతో కలిసి సందర్శించారు. ఇక్కడ రెండు దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణసంచా వ్యాపారులు విధిగా పోలీసు, అగ్నిమాపక శాఖ, జీవీఎంసీ, రాష్ట్ర పన్నుల శాఖ అనుమతులు తీసుకోవాలని సూచించారు. అలాగే బాణసంచా దుకాణల మధ్య నిర్ణీత దూరం పాటించాలన్నారు. దుకాణాల వద్ద నీరు, ఇసుక సిద్ధంగా ఉంచాలని ఆయన స్పష్టం చేశారు. ఈస్ట్ జోన్ పరిధిలో బాలయ్యశాస్త్రి లే అవుట్, ఆంధ్రా యూనివర్సిటీ మైదానం, తదితర ప్రాంతాల్లో బాణసంచా విక్రయ దుకాణాలు ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఆయనవెంట నాలుగో పట్టణ సీఐ ఎస్.విజయకుమార్, ఇతర పోలీసులు ఉన్నారు.

కార్తీకమాస ఉత్సవాలకు ఎమ్మెల్యేకి ఆహ్వానం


ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈవో రమాభాయి

సీతమ్మధార : కార్తీకమాస ఉత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకి శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి రమాభాయి ఆహ్వానం అందజేశారు. ఈ మేరకు బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో గల ఎమ్మెల్యే నివాసంలో ఆమె సోమవారం కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామకృష్ణానగర్‌లో గల దేవస్థానంలో ఈ ఏడాది నవంబర్ 2 నుంచి డిసెంబర్ ఒకటి వరకు కార్తీకమాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. 15న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని జ్వాలాతోరణం ఏర్పాటు చేస్తున్నామన్నారు. 29న మాసశివరాత్రి సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి శ్రీ రామలింగేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం జరుపుతామని, అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తామని తెలిపారు. అలాగే సీతంపేట గణేష్‌నగర్‌లో గల శ్రీ పార్వతీశ్వరాలయంలో కూడా కార్తీకమాస ఉత్సవాలకు హాజరవ్వాలని ఆమె ఎమ్మెల్యేని కోరారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ప్రారంభం


జగ్గారావు బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన గౌరీ పరమేశ్వరుల విగ్రహం

సీతంపేట : స్థానిక అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి వద్ద శ్రీగౌరీ పరమేశ్వర ఆలయం, సేవా సంఘం ఆధ్వర్యంలో 43వ గౌరీ పరమేశ్వరుల వార్షికోత్సవం ప్రారంభమైంది. ఈ నెల 26న గౌరీ పరమేశ్వరుల విగ్రహ ప్రతిష్టతో ప్రారంభమైన ఉత్సవాలు నవంబరు 23 వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మండపంలో ఏర్పాటు చేసిన విగ్రహానికి రోజూ పూజలు చేస్తున్నారు. పరిసర ప్రాంత భక్తులు గౌరీపరమేశ్వరులను దర్శించుకుని పూజలు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా నవంబరు 5న నాగుల చవితి సందర్భంగా కోలాట ప్రదర్శన, 22న శుక్రవారం అమ్మవారి సారె ఊరేగింపు, 23న అనుపోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

యూజీడీ కార్మికులకు పూర్తి వేతనాలివ్వాలి


టీఎస్ఆర్ కాంప్లెక్స్ వద్ద ధర్నా చేస్తున్న యూజీడీ కార్మికులు

సీతమ్మధార : భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) విభాగం కార్మికులందరికీ సమానంగా వేతనాలు చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నేతలు కోరారు. ఈ మేరకు ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్స్ వద్ద సోమవారం నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. యూజీడీ విధులు నిర్వహిస్తున్న 90 మందికి మాత్రమే జీవో 36 ప్రకారం రూ.24,500 వేతనం చెల్లిస్తున్నారని గుర్తు చేశారు. మిగిలిన 179 మంది కార్మికులకు తక్కువ వేతనాలివ్వడం అన్యాయమని దుయ్యబట్టారు. చనిపోయిన కార్మికుల వారసులకు మూడేళ్లుగా ఉద్యోగాలు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ.2 లక్షల నష్టపరిహారమివ్వాలని కోరారు. ఈ మేరకు ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలు చేయాలని కోరారు. ధర్నాలో యూనియన్ అధ్యక్షుడు టి.నూకరాజు, ఆదినారాయణ, యు.రాజు పాల్గొన్నారు.

అలరించిన 'దీపావళి' కవి సమ్మేళనం


కవితలు వినిపిస్తున్న డీవీ సూర్యారావు

సీతంపేట : విశాఖ సాహితి ఆధ్వర్యంలో శ్రీలలితాపీఠంలో 'దీపావళి' అంశంపై కవి సమ్మేళనం సోమవారం నిర్వహించారు. విశాఖ సాహితి ఉపాధ్యక్షులు కందాళ కనక మహాలక్ష్మి అధ్యక్షత వహించి దీపావళి ప్రత్యేకత, ప్రాధాన్యత వివరించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.వి.సూర్యారావు కవితలు ఎలా ఉండాలో, కవుల బాధ్యతను వివరించారు. సీహెచ్.చినసూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి, పిల్లా రమణమూర్తి, కె.వి.ఎస్.మూర్తి, దేవులపల్లి పద్మజ, శేఖరమంత్రి ప్రభాకర్, కె.గౌరీపతి శాస్త్రి, అయ్యల సోమయాజుల ప్రసాద్, సుజాతామూర్తి, దామరాజు విశాలాక్షి, వడలి అనంతరామ్, గండికోట విశ్వనాథం కవితలు చదివి వినిపించారు.